పండుగొచ్చిందోచ్!

- సాలూరు శ్యామలాంబ జాతరకు సర్వం సిద్ధం
- నేడు ఉయ్యాల కంబాల
- రేపు తొలేళ్లు
- 20న సిరిమానోత్సవం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- అంతటా సందడే సందడి


సిద్ధమవుతున్న సిరిమాను


శ్యామలాంబ అమ్మవారు


ముస్తాబైన ఆలయం

సాలూరు గ్రామ దేవత శ్యామలాంబ పండుగకు సర్వం సిద్ధమైంది. నేటి నుంచి జాతర ప్రారంభం కానుండడంతో పట్టణం ఉత్సవ శోభను సంతరించుకుంది. సుమారు 15 ఏళ్ల తర్వాత పండుగ జరుగుతుండడంతో అంతటా సందడి వాతావరణం నెలకొంది. బంధువులు, స్నేహితులతో ప్రతీ వీధి కళకళలాడుతోంది. ఆదివారం ఉయ్యాల కంబాల ఉత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశారు. సోమవారం తొలేళ్లు, మంగళవారం సిరిమానోత్సవం నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. ఇప్పటికే అమ్మవారి సిరిమాను, అంజలి రథం, వీరభద్రుని ప్రభ పనులు పూర్తయ్యాయి. శ్యామలాంబ ఆలయంలో ప్రత్యేక క్యూలైన్లను సిద్ధం చేశారు. పట్టణంలో మొబైల్ టాయిలెట్లు, పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారు. పెద్దఎత్తున భక్తులు తరలిరానున్న నేపథ్యంలో ఎవరికీ ఎటువంటి ఇబ్బంది కలగకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. సాంస్కృతిక కార్యక్రమాలకు కూడా అన్ని ఏర్పాట్లు చేశారు.

(పూర్తి వివరాలు 6వ పేజీలో)

రేపే బొబ్బిలి మున్సిపల్ చైర్మన్ ఎన్నిక


బొబ్బిలి మున్సిపల్ కార్యాలయం

బొబ్బిలి/ రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మున్సిపల్ చైర్మన్ పదవికి ఈ నెల 19న సోమవారం ఎన్నిక జరగనుంది. గత నెల 29న ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో వైసీపీకి చెందిన మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ పదవిని కోల్పోయిన విషయం తెలిసిందే. సొంత పార్టీకి చెందిన పది మంది కౌన్సిలర్లే ఆయన్ని వ్యతిరేకించారు. ఆపై టీడీపీకి చెందిన పది మంది కౌన్సిలర్లతో కలిసి అవిశ్వాసం ప్రకటించారు. ఈ క్రమంలో సుమారు నెల రోజుల పాటు ప్రత్యేక శిబిరాలు కొనసాగాయి. అవిశ్వాస తీర్మానం వీగిపోయేలా చూసేందుకు వైసీపీ పెద్ద నాయకులు చేసిన అన్ని ప్రయత్నాలూ విఫలమయ్యాయి. చివరికి అధికార టీడీపీదే పై చేయి అయ్యింది. 21 మంది అవిశ్వాసానికి అనుకూలంగా, 10 మంది వ్యతిరేకంగా ఓటు వేయడంతో అవిశ్వాసం నెగ్గింది.

చైర్మన్ కుర్చీలో ఎవరో?

టీడీపీ బొబ్బిలి పట్టణ అధ్యక్షుడు రాంబార్కి శరత్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావుల మధ్య చైర్మన్ పదవికి గట్టి పోటీ నెలకొంది. అయితే శరత్ పేరు చైర్మన్ పదవికి ఖరారు అయినట్లు ప్రచారం జరుగుతోంది. గత మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ గెలిస్తే గెంబలికి చైర్మన్ ఇవ్వాలనుకున్నారు. టీడీపీ గెలవకపోవడంతో ఆయనకు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ పదవి ఇచ్చి సంతృప్తి పరిచారు. నాటి పరిస్థితులను తెరమీదకు తెస్తూ పార్టీ పెద్దలపై గెంబలి తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు.

పనులు చేపట్టేది ఇలాగేనా?

- కురుపాంలో ఇష్టారాజ్యంగా కాలువల నిర్మాణం
- రోడ్డు విస్తరణా అంతే..
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- ప్రజల పెదవి విరుపు
- ఉన్నతాధికారులు స్పందించాలని విన్నపం

కురుపాం, మే17(ఆంధ్రజ్యోతి): కురుపాంలో రోడ్డు, కాలువ పనులను ఇష్టారాజ్యంగా చేపడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం.. అడిగే వారే లేకపోవడంతో నిర్మాణాలు సక్రమంగా జరగడం లేదు. రోడ్డుకు మీటర్ ఎత్తులో కాలువలు నిర్మిస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. ఇంజనీరింగ్ సిబ్బంది లేకుండానే ప్రధాన రోడ్డు విస్తరణ పనులు కూడా చేపడుతుండడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


బస్టాండు సమీపంలో రోడ్డుకు మీటరు పైగా ఎత్తులో నిర్మించిన కాలువ ఇలా..

ఇదీ పరిస్థితి..

- వాస్తవంగా 2022లో తోటపల్లి-కురుపాం 14 కిలో మీటర్ల రహదారి విస్తరణ పనులను ప్రారంభించారు. అప్పట్లో రూ.33 కోట్లను మంజూరు చేశారు. తోటపల్లి నుంచి కురుపాం వరకు బీటీ రోడ్డు వేశారు. కురుపాంలో సీమనాయుడు వలస సెంటర్, మేరంగి జంక్షన్ వద్ద సీసీ రోడ్డు వేయాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా 2023లో కురుపాం ప్రధాన రోడ్డుకు ఇరువైపులా 14 మీటర్ల మేర షాపులు, ఇళ్లు, పలు ఆక్రమణలను తొలగించి కాలువ పనులకు శ్రీకారం చుట్టారు. అయితే బీటీ రోడ్డు పూర్తయినా బిల్లులు రాకపోవడంతో కాలువ పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. గత మూడేళ్లగా ఎవరూ పట్టించుకోకపోవడంతో అవి పూడికపోయాయి. మురుగునీరు వెళ్లక స్థానికులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. పైప్‌లైన్లు కూడా ధ్వంసం కావడంతో తాగునీటికి ప్రజలు నానా అవస్థలు పడ్డారు.
- ఈ ఇబ్బందులను పరిగణనలోకి తీసుకున్న కూటమి ప్రభుత్వం బిల్లులు చెల్లించి.. పనులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో గత మూడు నెలలుగా రోడ్డు విస్తరణ, కాలువ పనులు ఊపందుకున్నాయి. అయితే అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టారీతిన పనులు చేపడుతున్నారు.


అధికారులు లేకుండా రోడ్డు విస్తరణ చేపడుతున్న దృశ్యం

పనులు ఇలా..

- స్థానిక ధూళికేశ్వరస్వామి ఆలయం వద్ద కొత్తగా కల్వర్టు నిర్మించారు. అక్కడున్న ప్రధాన కాలువకు అనుసంధానంగా దీనిని నిర్మించకపోవడంతో ఆ ప్రాంతంలో మురుగునీరు నిలిచిపోతుంది. ప్రధాన రహదారి కంటే ఆరు అంగుళాల ఎత్తులో కల్వర్టు, కాలువలు నిర్మించడంతో ఈ సమస్య నెలకొంది. వర్షాలు కురిస్తే మెయిన్ రోడ్డులో ఉన్న ధూళికేశ్వరస్వామి ఆలయంలోకి మురుగు నీరు చేరే అవకాశం ఉందని భక్తులు భావిస్తున్నారు.
- వడ్డీ వీధి, బ్రాహ్మణుల వీధిలో కాలువల కంటే మెయిన్ రోడ్డులో కాలువలను ఎత్తుగా

(మిగతా 8వ పేజీలో...)

ఉపాధితో గ్రామాల అభివృద్ధి

- జిల్లా ప్రత్యేకాధికారి నారాయణ భరత్ గుప్తా

పార్వతీపురం రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవచ్చని జిల్లా ప్రత్యేకాధికారి నారాయణ భరత్ గుప్తా తెలిపారు. శనివారం లక్ష్మీనారాయణపురంలో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ' ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలకు కావాల్సిన రహదారులు, కాలువలు, చెరువుల్లో పూడికతీత, భూమి చదును పనులు, ఇంకుడు గుంతలు, ఫాంపాండ్స్, నీటి కుంటల నిర్మాణం వంటివి చేసుకోవచ్చు. పర్యావరణ , మౌలిక వసతుల అభివృద్ధి, జలనవనరుల నిర్వహణ, వ్యవసాయ పనులు, కూడా నిర్వహించు కోవచ్చు. వేతనదారులు స్వగ్రామాల్లోనే పనులను చేసుకుని వేతనాన్ని పొందొచ్చు. ఇతరప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదు.' అని తెలిపారు. అనంతరం చలివేంద్రంలో కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. వైద్య శిబిరాన్ని సందర్శించి వేతనదారులకు పరీక్షలు చేయించారు. ఆయన వెంట కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, డ్వామా పీడీ కె.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.


వేతనదారులకు మజ్జిగ అందిస్తున్న జిల్లా ప్రత్యేకాధికారి

ఆరోగ్యకర జీవనశైలితో బీపీ నియంత్రణ

- డీఎంహెచ్‌వో భాస్కరరావు

పార్వతీపురం, మే 17 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకర జీవనశైలితో రక్తపోటును నియంత్రించొచ్చని డీఎంహెచ్‌వో భాస్కరరావు తెలిపారు. శనివారం ప్రపంచ రక్తపోటు దినం సందర్భంగా ఆరోగ్య కార్యాలయ ప్రాంగణంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనిషిని నిశ్శబ్దంగా దెబ్బతీసే రోగ కారకాల్లో రక్తపోటు ఒకటని తెలిపారు. సరైన ఆహార నియమాలు పాటించడం ద్వారా దానిని అదుపులోకి తేవొచ్చన్నారు. సకాలంలో బీపీని గుర్తించకపోవతే శరీరంలో ముఖ్యమైన అయవాలపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. మరిన్ని తీవ్రమైన అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలిపారు. తీవ్ర తలనొప్పి, సాధారణం కంటే గుండె ఎక్కువగా కొట్టుకోవడం, ఛాతి వద్ద బిగుతుగా అనిపించడం, చిన్న చిన్న పనులు చేసినా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలిగితే వెంటనే వైద్యులను సంప్రదిం చాలని సూచించారు. ఉప్పు తగ్గించుకోవడం, సమతుల ఆహారం , శారీరక శ్రమ అవసరమన్నారు. ఎన్‌సీడీ సర్వేలో గుర్తించిన బీపీ వ్యాధిగ్రస్థుల ఆరోగ్యం మెరుగుకు కృషి చేయాలని సిబ్బందిని ఆదేశించారు.


సూపరింటెండెంట్ కామేశ్వరరావుకు బీపీ పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

పద్మ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం, మే17(ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మక పద్మ అవార్డులకు కేంద్ర ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తుందని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన వారు దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.పద్మఅవార్డ్స్‌జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో నియమ నిబంధనలను పరిశీలించాలని సూచించారు. యువజన సర్వీసుల శాఖ సెట్విజ్, విజయనగరం కార్యాలయానికి రెండు సెట్లతో దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. ఇతర వివరాల కోసం ఈ 98499 09080 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

ఇక పక్కాగా స్వయంశక్తి సంఘాల సమావేశాలు

- ముఖ ఆధారిత నమోదు ప్రారంభం


8 లో

రైతులకు మెరుగైన సేవలు

- డీసీసీబీ సీఈవో ఉమామహేశ్వరరావు

గరుగుబిల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాల పరిధిలో రైతులకు సహకార బ్యాంకుల ద్వారా మెరుగైన సేవలందించేందుకు చర్యలు చేపడుతున్నామని డీసీసీబీ సీఈవో సీహెచ్ ఉమామహేశ్వరరావు తెలిపారు. శనివారం గరుగుబిల్లి ప్రాథమిక సహకార సంఘాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...' గత ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో రూ. 2,165 కోట్ల లావాదేవీలు జరిగాయి. డీసీసీబీకి రూ. 7.66 కోట్లు నికర ఆదాయం వచ్చింది. ఇందులో ఒక శాతం 94 పీఏసీఎస్‌లకు అందించాం. సహకార బ్యాంకుల నుంచి ప్రభుత్వ పథకాలకు, టిడ్కో గృహాలతో పాటు మహిళా సంఘాలకు రుణాలు మంజూరు చేశాం. ఉమ్మడి జిల్లాల పరిధిలో సుమారు రూ.90 కోట్ల బకాయిలు ఉన్నాయి. వాటి వసూళ్లకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. బకాయిలున్న వారికి ముందుగా ఆరు నోటీసులు జారీ చేస్తున్నాం. ఆ తరువాత 8, 9 నోటీసులు అందిస్తున్నాం. డీసీసీబీ బ్రాంచ్‌ల పరిధిలో 8, 9 నోటీసులు అందించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించాం. ఈ ఏడాది రెండు జిల్లాల పరిధిలో రూ. 2,600 కోట్ల లావాదేవీల లక్ష్యంగా పెట్టుకున్నాం. 200 మంది సిబ్బందితో సమావేశం నిర్వహించి డీసీసీబీల ఆర్థిక బలోపేతానికి దిశా నిర్దేశాలు చేస్తున్నాం. నూతనంగా విజయనగరం పరిధిలో 4, పార్వతీపురం పరిధిలో ఒక బ్రాంచ్ ఏర్పాటు చేస్తాం. గరుగుబిల్లిలో డీసీసీబీ బ్రాంచ్ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నాం.' అని తెలిపారు. ఈ పరిశీలనలో డీసీసీబీ మేనేజర్ రవికుమార్, ఆప్కాబ్ డీపీఎం గౌరీశంకర్, నోడల్ అధికారి సంతోష్‌కుమార్, సూపర్‌వైజర్, సిబ్బంది పాల్గొన్నారు.


గరుగుబిల్లి పీఏసీఎస్‌లో మాట్లాడుతున్న సీఈవో

జిల్లావ్యాప్తంగా స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర

- గ్రామాల్లో బీట్ ది హీట్ ర్యాలీలు
- మొక్కలు నాటిన అధికారులు

8 లో

వీరులారా.. వందనం

- ఉత్సాహంగా తిరంగా ర్యాలీ




కురుపాంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

6 లో

సాలూరుకు పండుగొచ్చింది!

- శ్యామలాంబ ఉత్సవాలకు సర్వం సిద్ధం
- సిరిమాను, అంజలి రథం పనులు పూర్తి
- నేడు ఉయ్యాల కంబాల
- రేపు తొలేళ్లు ● 20న సిరిమాను ఉత్సవం



విద్యుత్ కాంతుల్లో వీరభద్రుని ప్రభ

సాలూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): సాలూరు గ్రామ దేవత శ్యామలాంబ అమ్మవారి పండుగ ఆదివారం నుంచి ప్రారంభం కానుంది. సుమారు 15 ఏళ్ల తర్వాత నిర్వహిస్తున్న ఈ పండుగకు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో రానున్నారు. పది లక్షల మందికి పైగా భక్తులు రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆమేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఐదు పార్కింగ్ స్థలాలు..

ఉత్సవాలకు వచ్చే భక్తుల వాహనాలు నిలిపేందుకు సాలూరు పట్టణం చుట్టూ ఐదు పార్కింగ్ స్థలాలను పోలీసులు ఏర్పాటు చేశారు. రామభద్రపురం నుంచి వచ్చే వాహనాలు నిలుపుదల చేసేందుకు ముత్యాలమ్మ గుడి ఎదురుగా ఉన్న పార్కింగ్ స్థలాన్ని కేటాయించారు. జీగిరాం నుంచి వచ్చే వాహనాలకు కె.వి.ఆర్.రెసిడెన్సీ, మామిడిపల్లి వైపు నుంచి వచ్చే వాహనాలకు నారాయణ స్కూల్ వద్ద పార్కింగ్ స్థలాన్ని కేటాయించారు. మక్కువ వైపు నుంచి వచ్చే వాహనాలకు బైపాస్ రోడ్డు వద్ద... నెలిపర్తి, మోసూరు, పాంచాలి వైపు నుంచి వచ్చే వాహనాలను నిలిపేందుకు బంతి స్టేడియం, బంగారమ్మ కాలనీల్లో పార్కింగ్ స్థలాలను కేటాయించారు. పార్కింగ్ ప్రదేశాల నుంచి పట్టణంలోకి వచ్చేందుకు ఆటోల సదుపాయం కల్పిస్తున్నారు. పట్టణంలో వాహనాలు తిరగడాన్ని పోలీసులు పూర్తిగా నిషేధించారు.



రథం మానును దర్శించుకుంటున్న సబ్ కలెక్టర్



సిద్ధమైన అంజలి రథం

వీరభద్రుడి ప్రభ సిద్ధం..

స్థానిక మెంటాడ వీధిలో సుమారు 75 అడుగుల ఎత్తు కలిగిన వీరభద్రుని ప్రభను ఇప్పటికే ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం 9 గంటలకు మెంటాడ వీధి రామమందిరం వద్ద దీనిని నిలబెట్టనున్నారు. పులి వేషాలు, అఘోరా డ్యాన్స్‌ల వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించున్నారు. అదే రోజున స్థానిక రామ మందిరం నుంచి తొలేళ్ల ఉత్సవానికి బయలుదేరనున్నారు.



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ డి.టి.వి.కృష్ణారావు

భక్తులకు ఇబ్బందులు కలగకూడదు..

శ్యామలాంబ అమ్మవారి పండుగను అత్యంత ఘనంగా నిర్వహించాలని.. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తరాదని సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ అన్నారు. శనివారం సాలూరు వచ్చిన ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం నడుచుకుంటూ అమ్మవారి ఆలయం నుంచి నాయుడువీధి రామమందిరం వరకు వెళ్లారు. సిరిమానును దర్శించుకొని మరలా బోసు బొమ్మ వరకు కాలినడకన రథంమాను తిరిగే ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, ఉత్సవ కమిటీ అధ్యక్షులు అక్కేన అప్పారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

45 అడుగుల సిరిమాను

శ్యామలాంబ అమ్మవారి పండుగలో ప్రధాన ఘట్టమైన సిరిమాను ఉత్సవం ఈ నెల 20న సాయంత్రం నాలుగు గంటల నుంచి ప్రారంభం కానుంది. సుమారు 45 అడుగుల పొడవు కలిగిన సిరిమాను రథాన్ని ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసింది. దానితో పాటు అంజలి రథం కూడా భక్తులకు కనువిందు చేయనుంది. ఉత్సవాల సందర్భంగా ప్రముఖ టీవీ, సినీ నటులతో సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వెయ్యి మందికి పైగా పోలీసు బలగాలు రానున్నాయి. 68 సీసీ కెమెరాలతో పాటు 6 డ్రోన్లతో పటిష్ఠ నిఘా ఏర్పాటు చేశారు.

ప్రభుత్వ లక్ష్యానికి బీటలు!

- రెండు దశాబ్దాల క్రితం పైప్‌లైన్ ఏర్పాటు ● ఎక్కడికక్కడే లీకులు ● వృథాగా పోతున్న రక్షిత నీరు ● కొరవడిన పర్యవేక్షణ

రాజాం రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): అది శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలోని ఎనిమిది మండలాల పరిధిలో గల 239 గ్రామాల ప్రజల దాహార్తిని తీర్చే సమగ్ర రక్షిత మంచినీటి సరఫరా పథకం. దాని కోసం రూ.109 కోట్లను వెచ్చించారు. రెండు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన ఈ పైపులైన్ తరచూ బీటలు వారడం, రక్షితనీరు ఏరులై ప్రవహించడం సాధారణమై పోయింది. దీంతో ప్రజల చెంతకు తాగునీరు చేరడం జాప్యమవుతోంది. తరచూ తలెత్తుతున్న సమస్యలు అధికారులకు తెలిసినా పైపైన పనులు చేసి మమ అనిపిస్తున్నారు. దీంతో సమస్య జటిలమవుతోందే తప్ప శాశ్వత పరిష్కారానికి నోచుకోవడం లేదు. ప్రజల దాహార్తి తీరడం లేదు. సుమారు 80 కిలోమీటర్ల మేర ఏర్పాటు చేసిన ప్రధాన పైప్‌లైన్ తరచూ బీటలు వారుతోంది. కొన్నిచోట్ల పైప్‌లైన్ జాయింట్లు పటుత్వం కోల్పోయి తాగునీరు వృథా అవుతోంది. ఈ సమస్య అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.



పైప్‌లైన్ లీకులతో రహదారిపై ప్రవహిస్తున్న నీరు

● ఐదు లక్షల మంది కోసం..

రాజాం, రేగిడి, చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, శ్రీకాకుళం జిల్లాలోని జి.సిగడాం, పొందూరు, లావేరు మండలాలలోని 239 గ్రామాలకు చెందిన సుమారు 5 లక్షల మంది తాగునీటి అవసరాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 2004లో భారీ రక్షిత మంచినీటి పథకాన్ని మంజూరు చేశారు. దీని కోసం ప్రభుత్వం మూడు దశల్లో రూ.109 కోట్లు విడుదల చేసింది. ఈ మొత్తంతో రేగిడి మండలంలోని నాగావళి నది నుంచి రెండు జిల్లాల్లోని ఎనిమిది మండలాలకు తాగునీరు సరఫరాకు పైపులైన్లు ఏర్పాటు చేశారు.

● ఎక్కడెక్కడికి అంటే...

జి.సిగడాం మండలంలో 62 గ్రామాలకు, పొందూరులో మూడు, లావేరులో ఒక గ్రామానికి తాగునీరు సరఫరాకు పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. రేగిడి మండలంలో మూడు, రాజాంలో మూడు, చీపురుపలిలో 53, గరివిడిలో 50, మెరకముడిదాంలో 64 గ్రామాలకు రక్షితనీటి సరఫరాకు వీలుగా పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. రెండు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన పైప్‌లైన్ తరచూ మరమ్మతులకు గురవుతోంది. ఎప్పటికప్పుడు ఎక్కడికక్కడ లీకేజీలకు గురవుతోంది. కొన్నిచోట్ల పైపులు బీటలు వారుతున్నాయి. చిన్నపాటి లీకేజీలతో నెలల తరబడి తాగునీరు వృథా అవుతోంది. దీంతో ప్రజలకు సరిగా నీరు చేరడం లేదు. గతంలో జి.ఎం.ఆర్. కేర్ హాస్పిటల్ సమీపంలో పలుమార్లు పైప్‌లైన్లకు బీటలు వారాయి. బొద్దాం దాటిన తరువాత కూడా ఇదే పరిస్థితి. 2 నెలలుగా బొద్దాం-జెండాల దిబ్బ మధ్య పైపులైన్ బీటలు వారింది. దీంతో రక్షిత నీరు లీకవుతోంది. ఈ లీకేజీని నివారించేందుకు పైప్‌లైన్ పై ఇసుక బస్తాలు వేసి... మమ అనిపించారు. రెండు నెలలుగా ఇదే పరిస్థితి ఉందని బొద్దాం గ్రామానికి చెందిన బట్న హరనాథ్, శంకరరావు, రమణమూర్తి తదితరులు తెలిపారు.



బొద్దాంలో వృథాగా పోతున్న రక్షిత నీరు

● కొరవడిన పర్యవేక్షణ

పథకం నిర్వహణలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. సుమారు 80 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ విస్తరించి ఉండడం... కొన్నిచోట్ల తుప్పలు, తోటలు, మరికొన్ని చోట్ల భూగర్భంలో పైప్‌లైన్ ఏర్పాటు చేయడంతో తరచూ బీటలు వారుతున్నాయి. ఇప్పటికైనా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి..పైప్‌లైన్లకు మరమ్మతులు చేసి... తాగునీటి వృథాను అరికట్టాలని రెండు జిల్లాల ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి అక్కడే కొనసాగేలా చూడండి

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం/విజయనగరం కలెక్టరేట్, మే 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రిని మెడికల్ కాలేజీకి తరలించకుండా.. ప్రస్తుతం ఉన్న చోటనే కొనసాగించడానికి గల అవకాశాలను పరిశీలించాలని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్యాధికారులు, ఇంజినీరింగ్ అధికారులతో శనివారం మధ్యాహ్నం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జీజీహెచ్ భవనాల మాస్టర్ ప్లాన్ తీసుకుని భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా అభివృద్ధి చేయడానికి గల అవకాశాలపై అంచనాలను తయారు చేయాలన్నారు. సుమారు 4 ఎకరాల వరకూ జీజీహెచ్‌లో వినియోగంలో లేకుండా ఖాళీగా ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. ఈ స్థలంలో బెడ్స్ సంఖ్య పెంచడంతో పాటు స్పెషాలిటీ వార్డులను ఏర్పాటు చేయవచ్చునని అభిప్రాయం వ్యక్తం చేశారు. 15 రోజుల్లో ప్రస్తుత ఆసుపత్రి వివరాలను మాస్టర్ ప్లాన్‌తో సహా అందించాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి, కలెక్టర్ అంబేడ్కర్, జీజీహెచ్ సూపరింటెండెంట్ అప్పలనాయుడు, మెడికల్ కాలేజ్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శివ శ్రీధర్, ఏపీఎస్‌డీసీ ఈఈ శ్రీనివాసమూర్తి, డీఈఈ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

1500 మంది ఓటర్లకు మించితే కొత్త కేంద్రాలు

- ఇన్‌చార్జి డీఆర్‌వో మురళి

విజయనగరం కలెక్టరేట్, మే 17 (ఆంధ్రజ్యోతి): ఒకే పోలింగ్ కేంద్రంలో 1500 కంటే ఎక్కువ ఓటర్లు ఉంటే మరో పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదిస్తామని ఇన్‌చార్జి డీఆర్‌వో మురళి తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకూ 1200 ఓటర్లు పైబడిన కేంద్రాలు 138 ఉన్నాయని చెప్పారు. శనివారం సాయంత్రం రాజకీయ పార్టీల ప్రతినిధులతో తమ చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌వో మాట్లాడుతూ ఓటరు జాబితాలో పేరు నమోదు కోసం ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మార్పులు, చేర్పుల కోసం ఫారం 8, తొలగింపుల కోసం ఫారం 7లో దరఖాస్తు చేయాలని సూచించారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఆర్‌వో మురళి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

పూర్తిస్థాయిలో సాగునీరు అందించండి

- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కళా వెంకటరావు

రాజాం, మే 17 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా చీపురుపల్లి, శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నియోజకవర్గాలకు పూర్తి స్థాయిలో సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు ఆదేశించారు. శనివారం రాజాంలోని క్యాంపు కార్యాలయంలో నీటి పారుదల శాఖ, కొవ్వాడ అణువిద్యుత్ కేంద్రం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏటా సాగునీటి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని రైతులు తన దృష్టికి తెస్తున్నారని తెలిపారు. అందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని సీఎం చంద్రబాబును కోరానని చెప్పారు. నిధులు మంజూరైన వెంటనే పనులు పూర్తి చేసి... ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ విషయంలో ఎటువంటి జాప్యం చేయవద్దని ఆదేశించారు. కూటమి ప్రభుత్వం రైతులకు ఇబ్బందులు కలిగించకూడదనే ఉద్దేశంతో ముందుకు వెళుతోందన్నారు. పూర్తి స్థాయిలో సాగునీరు అందించేందుకు సీఆర్‌ఎఫ్ నిధులు ఖర్చు చేయాలని ఎమ్మెల్యే కళా సూచించారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వీరులారా.. వందనం

- ఉత్సాహంగా తిరంగా ర్యాలీ

కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన 'ఆపరేషన్ సిందూర్' విజయవంతమైన సందర్భంగా శనివారం ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో తిరంగా ర్యాలీలను ఉత్సాహంగా నిర్వహించారు. త్రివిధ దళాల్లోని సైనికుల ధైర్య సాహసాలను కొనియాడారు. అమర జవానులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఎక్కడికక్కడ మానవహారాలు నిర్వహించారు. భారీ జాతీయ పతాకాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, యువతీయువకులు, వివిధ స్వచ్ఛంద, ప్రజా సంఘాల ప్రతినిధులు, సైనికుల కుటుంబ సభ్యులు, మాజీ సైనికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

-ఆంధ్రజ్యోతి బృందం



పాలకొండ: తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తదితరులు



చీపురుపల్లి: ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కళా వెంకటరావు తదితరులు



ఎస్.కోట: ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి తదితరులు



బొబ్బిలి రూరల్: ర్యాలీని ప్రారంభించిన ఎమ్మెల్యే బేబీనాయన, మాజీ మంత్రి సుజయ్ తదితరులు



కురుపాం: తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తదితరులు

వినియోగించరా..?

●లక్ష్యానికి దూరంగా చెత్త సంపద కేంద్రాలు ●పట్టించుకోని అధికారులు

గజపతినగరం, మే17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పంచాయతీల్లో ఏర్పాటు చేసిన చెత్త సంపద కేంద్రాలు నిరుపయోగం ఉన్నాయి. వాటి నిర్వహణకు పాలకులు పట్టించుకోవడంలేదు. ఎంతో సమున్నత లక్ష్యంతో గతంలో టీడీపీ ప్రభుత్వం పంచాయతీలో చెత్త సంపద కేంద్రాలను ఏర్పాటు చేసింది. చెత్త ద్వారా సంపద సృష్టించేందుకు చర్యలు చేపట్టింది. చెత్త నుంచి ఎరువును తయారీ చేసి రైతులకు విక్రయించేవారు. తద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూరేది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటి నిర్వహణను గాలికి వదిలేసింది. పైగా చెత్త పన్ను విధించింది. మళ్లీ రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడంతో చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతుంది. అయితే అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడంలో విఫలమవుతున్నారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరి దాదాపు ఏడాది కావాస్తున్నా చెత్త సంపద కేంద్రాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురాలేక పోతోంది. మండలంలోని 30 పంచాయతీల్లో చెత్త సంపద కేంద్రాలను ఏర్పాటు చేశారు. గజపతినగరం, పురిటిపెంట పంచాయతీల్లో మాత్రమే చెత్తను సేకరించి కేంద్రాలు తరలిస్తున్నారు. పురిటిపెంట పంచాయతీకి సంబంధించి అదనంగా సంపద కేంద్రం అవసరమైనప్పటికీ స్థలం లేక చంపావతి తీరాన పారబోస్తున్నారు. ఇక్కడ చెత్తను మరుపల్లిలో కొండ ప్రాంతానికి చెత్త తరలించేందుకు అధికారులు ప్రయత్నాలు చేపట్టినా వీలుకాలేదు. ఒక ఊరి చెత్తను మాఊరి మీదుగా ఎలా తీసుకు వెళ్తారని మరుపల్లి వాసులు అడ్డుకున్నారు. మిగిలిన 28 పంచాయతీల్లోని చెత్త సంపద కేంద్రాల్లో చెత్తపోగులతో నిండి ఉన్నాయి. చెత్తను రీసైక్లింగ్ చేయడంలేదు. మరికొన్ని చెత్తసంపద కేంద్రాల్లో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయి.


లింగాలవలసలో పేరుకుపోయిన చెత్త

చర్యలు తీసుకుంటాం..

మండలంలోని అన్ని చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకువస్తాం. గ్రామాల్లో సేకరించిన తడి, పొడి చెత్తను కేంద్రాలకు తరలించే దిశగా గ్రామ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాం.

- సుగుణాకరరావు, ఈవోపీఆర్డీ, గజపతినగరం

మందుబాబులకు అడ్డాగా..

●శృంగవరపుకోట రూరల్ : మండలంలోని వెంకటరమణపేట చెత్తసంపద కేంద్రం నిర్వహణకు పంచాయతీ పాలకులు గాలికొదిలేశారు. దీని కోసం పట్టించుకోవడలేదు. దాంతో మందు బాబులకు అడ్డామా రింది. సమున్నత లక్ష్యంలో నిర్మించిన చెత్త సంపద కేంద్రాన్ని నిర్లక్ష్యం చేస్తున్న తీరు పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


వెంకటరమణపేట చెత్తసంపద కేంద్రంలో మద్యం ఖాళీ సీసాలు

సరదాగా వెళ్లి.. విగతజీవిగా మారి..

●యువకుడి అనుమానాస్పద మృతి


ఈశ్వరరావు (ఫైల్)

మెంటాడ, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొంపంగి గ్రామానికి చెందిన ఆర్లి ఈశ్వరరావు (23) అనుమానాస్పదంగా శనివారం మృతి మృతిచెందాడు. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. ఈశ్వరరావు అన్నవరం సమీపంలోని దివీస్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. మూడు రోజుల కిందట సెలవుపై వచ్చి గ్రామంలో జరిగిన శుభకార్యాలకు హాజరై సంతోషంగా గడిపాడు. తిరిగి శనివారం రైలులో తిరుగు ప్రయాణమయ్యాడు. అంతలోనే తుని-అన్నవరం స్టేషన్‌ల మధ్య రైలు పట్టాలపై విగతజీవిగా పడి ఉండడాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. ఈశ్వరరావు మొబైల్‌లోని సిమ్ నుంచి అతడి తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. శనివారం ఉదయం వరకు తమతో సంతోషంగా గడిపిన కొడుకు ఆకస్మిక మృతి వార్తతో వారు కుప్పకూలిపోయారు. ఈశ్వరరావు తల్లిదండ్రులు తౌడు, సత్యవతి వ్యవసాయ కూలీలు, వీరికి కుమార్తె హేమలత ఉంది. చేతికి అందివచ్చిన కొడుకు ఇకలేడని తెలుసుకుని తల్లిదండ్రులు తల్లడిల్లుతున్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

బొండపల్లి, మే 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోగసింగిపేట సమీపంలో జాతీయ రహదారిపై శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడి మృతిచెందిన ఘటన చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి ఎస్ఐ మహేశ్ తెలిపిన వివరాల మేరకు.. నల్ల రంగు ప్యాంటు, కాఫీ రంగు టీషర్టు ధరించి సుమారు 35 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తిని గజపతినగరం నుంచి విజయనగరం వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొందన్నారు. తీవ్ర గాయాలు కావడంలో జిల్లా కేంద్రంలోని సర్వజన ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారన్నారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు బొండపల్లి పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

రైలు దిగుతూ వృద్ధుడు..

చీపురుపల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి రైల్వేస్టేషన్‌లో రైలు దిగుతూ ఎం.రామ్మూర్తి (60) శనివారం దుర్మరణం పాలయ్యాడు. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. తెర్లాం మండలం ఎం.ఆర్. అగ్రహారానికి చెందిన రామ్మూర్తి రాజమండ్రి నుంచి స్వగ్రామానికి తిరిగి రైలుపై వస్తున్నాడు. చీపురుపల్లి స్టేషన్‌లో రైలు దిగాడు. ఆ క్రమంలో ప్రమాదవశాత్తూ కింద పడిపోవడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.

డెంకాడలో వృద్ధురాలు..

డెంకాడ, మే 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పని ముగించుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో శనివారం డెంకాడకు చెందిన కొండ్రు పైడమ్మ (64) మృతి చెందింది. డెంకాడలోని ఎరకయ్య చెరువులో పనికి వెళ్లిన ఆమె తోటివారితో కలిసి ఇంటికి వెళ్తున్న సమయంతో కుప్పకూలి మృతి చెందినట్టు స్థానికులు తెలిపారు.

పిడుగుపాటుకు వ్యక్తి..

బొండపల్లి, మే 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవుపల్లిలో శనివారం సాయంత్రం పిడుగుపాటుకు వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించి ఎస్ఐ యు.మహేశ్ తెలిపిన వివరాల మేరకు.. గజపతినగరం మండలంలోని తుమ్మకాపల్లి గ్రామానికి చెందిన దేవర గంగులు (45) అత్తవారి ఊరిలో దేవుపల్లిలో గొర్రెలు కాపరిగా జీవనం సాగిస్తున్నాడు. సాయంత్రం ఊరికి దూరంగా పొలాల్లో గొర్రెలు కాస్తుండగా పిడుగుపడి అక్కడికక్కడే మృతిచెందారన్నారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశామన్నారు.

తహసీల్దారును దూషించడం తగదు

విజయనగరం దాసన్నపేట, మే 17 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం తహసీల్దారును జయలక్ష్మిని ఎమ్మెల్యే విజయచంద్ర దూషించడమేంటని జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రశ్నించారు. శనివారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాత్రి 10 గంటల సమయంలో మహిళా తహసీల్దారును భయబ్రాంతులకు గురిచేయడం తగదన్నారు. మహిళతో బూతులు మాట్లాడటం ఎంతవరకూ సమంజస మని నిలదీశారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే జోగారావు, జైహింద్‌కుమార్, కేవీ సూర్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

డెంకాడ, మే 17(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాకు సోమవారం అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ ఈఈ జి.సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని చింతలవలస, బెటాలియన్, రఘుమండ, గుండాలపేట, బొడ్డవలస, కృష్ణాపురం, వెలమపేట, గెద్దవానిపాలెం, జొన్నాడ, ఆకులపేట, డి.తాళ్లవలస, దువ్వపేట, సత్యనారాయణపురం, చెల్లూరు ఇండస్ట్రియల్ ఏరియాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేడు తాగునీటి సరఫరా నిలిపివేత

రాజాం, మే 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులకు ఆదివారం తాగునీటి సరఫరా ఉండదని కమిషనర్ జె.రామప్పలనాయుడు, ఏఈ పొన్నాడ వెంకట రామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. సారధి రోడ్డులో గల దివ్యాంగుల పాఠశాల సమీపంలో తాగునీటి పైపులైన్ పనుల నేపథ్యంలో రేగిడి నుంచి అన్ని వాటర్ ట్యాంకులను నీటి పంపింగ్ నిలిపి వేయనున్నామన్నారు. అన్ని వార్డుల ప్రజలు గమనించి సహకరించాలని ఆయన కోరారు.


సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి

చంద్రబాబును కలిసిన నాగమాధవి

భోగాపురం, మే17 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో క్యాంప్ కార్యాలయంలో శనివారం సీఎం చంద్రబాబును నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, నియోజకవర్గంలో రాజకీయ పరిణామాలను సీఎంకు వివరించారు.

నగరంలో పేలుడు సామగ్రి కలకలం

●పోలీసుల అదుపులో ఇద్దరు వ్యకులు

విజయనగరం క్రైం, మే 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో శనివారం పేలుడు సామగ్రిని స్వాధీనం కలకలం సృష్టించింది. విజయనగరం పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారంతో నగరానికి చెందిన సిరాజ్ ఉర్ రహ్మాన్‌ను వారు అదుపులోకి తీసుకున్నారు. అతడిచ్చిన సమాచారం మేరకు నగరంలోని ఓ ఇంట్లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. దాంతో పేలుళ్లకు ఉపయోగించే అమ్మోనియా, సల్ఫర్, అల్యూమినియం పౌడర్ లభించింది. విచారణలో రహ్మాన్ ఇచ్చిన సమాచారంతో హైదరాబాద్‌కి చెందిన సయ్యద్, సమీర్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇరువురిని కోర్టులో హాజరు పరిచినట్టు తెలిపారు. విజయవాడ నుంచి ఇంటిలిజెన్స్ అధికారులు ఇచ్చిన సమాచారంతో విజయనగరం పోలీసులు అలర్టయినట్టు తెలుస్తోంది.

22న అమ్మవార్లకు చల్లదనం

విజయనగరం రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కొత్తపేట, యాదవవీధి, బంగారమ్మ చదురు వద్ద మరిడమ్మ, ముత్యాలమ్మ, బంగారమ్మలకు ఈ నెల 22న చల్లదనమ హోత్సవం నిర్వహించనున్నారు. ఉదయం 6 గంటలకు ఘటాలకు పూజలు, సాయంత్రం 5 గంటలకు ఊరేగింపు నిర్వహించనున్నారు.

పోరలిలో రక్తదాన శిబిరం

దత్తిరాజేరు, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోరలి గ్రామంలో శనివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన సరాయవలస జానకిరామయ్య జ్ఞాపకార్థం సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్‌వీఎన్ బ్లడ్ బ్యాంకు శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాయికుమార్, రేవంత్, అమ్మ ఫౌండేషన్ అధ్యక్షుడు సురేష్, మాతృభూమి సేవాసంఘం కార్యదర్శి ఇప్పలవలస గోపీ, ఎన్‌వీఎన్ బ్లడ్ బ్యాంకు మేనేజర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హరితాంధ్రప్రదేశ్‌లో భాగస్వాములుకండి


మొక్క నాటుతున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

విజయనగరం రింగురోడ్డు, మే 17 (ఆంధ్రజ్యోతి): హరితాంధ్రప్రదేశ్ సాధనలో అందరూ భాగస్వాములు కావాలని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పిలుపునిచ్చారు. శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా 40వ డివిజన్ అరుంధతి నగర్‌లో ఎమ్మెల్యే అదితి గజపతిరాజుతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ చూడాలన్నారు. ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లాడుతూ అరుంధతి నగర్‌లో పార్కు నిర్వహణకు స్థానికులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో తూర్పుకాపు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస యశస్విని, కార్పొరేటర్ పట్నాన పైడిరాజు, కమిషనర్ నల్లనయ్య తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నివారణపై అవగాహన కల్పించండి


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

మెంటాడ, మే 17 (ఆంధ్రజ్యోతి): మలేరియా వ్యాధి కారకాలు, వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో జీవనరాణి వైద్య సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఆమె మండలంలోని చల్లపేట పీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడ సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్ నూరు శాతం జరిగేలా శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పీహెచ్‌సీలో శత శాతం ప్రసవాలు జరగాలన్నారు. సమయపాలన విధిగా పాటించాలని, రోగులకు ఎల్లపుడూ అందుబాటులోఉండాలనన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ ప్రేమ్‌కుమార్, హెల్త్ ఆఫీసర్ రాజు, ఎంపీహెచ్ఈవో శ్రీనివాసరావు, ఆప్తాలిక్ అధికారి ఎల్ఎల్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

నగరంలో మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

విజయనగరం కలెక్టరేట్, మే 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో శనివారం నగరంలో ఆర్టీసీ కాంప్లెక్ వద్ద మజ్జిగ పంపిణీ చేపట్టారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రను పురస్కరించుకుని కార్యక్రమాన్ని నిర్వహించారు. వేడిని నియంత్రణ కార్యక్రమంలో భాగంగా సుమారు 150 లీటర్ల మజ్జిగను పంపిణీ చేశారు. అలాగే స్థానిక ఆర్‌వో కార్యాలయంలో ఉద్యోగులు, సందర్శకులకు తాగునీటి సదుపాయం కల్పించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందించారు. అనంతరం ఆర్‌వో కార్యాలయంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఉన్నారు.

పేదలకు అమృత కలశాలు


చీరలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కళా

గరివిడి, మే 17(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతజయంతి ముందస్తు వేడులకను శనివారం గరివిడి మందిరంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కళావెంకటరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సత్యసాయి సేవాసంస్థ చేస్తున్న సేవాకార్యక్రమాలకు, చేయూతనిస్తున్న వ్యక్తులను అభినందించారు. ఈ సందర్భంగా నిరుపేదలకు అమృత కలశాలు, గొడుగులు, చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భజన మండలి కన్వీనర్ శ్రీరామ్, టీడీపీ నాయకులు సురేష్, బలరాం, రెడ్డి గోవింద్, బలగం వెంకటరావు, టి.శ్రీను, సేవాదళ్ సభ్యులు వాండ్రంగి వెంకటేశ్, సత్యారావు, నాయుడు, రాము పాల్గొన్నారు.

వసతిగృహాల తనిఖీ


బియ్యం నాణ్యతను పరిశీలిస్తున్న న్యాయాధికారి

శృంగవరపుకోట, మే 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ వసతిగృహాలను శనివారం శృంగవరపుకోట న్యాయాధికారి కనకలక్ష్మి సందర్శించారు. ప్రభుత్వ సాంఘిక సంక్షేమ, ప్రభుత్వ గిరిజన సంక్షేమ, ప్రభుత్వ వెనకబడిన సంక్షేమ వసతిగృహాలను తనిఖీ చేసి విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలపై ఆరా తీశారు. వసతి గృహా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లడుతూ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతిగృహంలో తప్ప మిగిలిన చోట్ల కనీస సదుపాయాలు లేవన్నారు. భవనాలు శిథిలావస్థలో ఉన్నాయన్నారు. ఇక్కడి పరిస్థితులను జిల్లా స్థాయి అధికారులకు న్యాయ సేవాసంస్థ ద్వారా నివేదిస్తామన్నారు. అనంతరం ఎస్.కోటలోని ఉప కారాగారాన్ని ఆమె పరిశీలించారు. ముద్దాయిలకు అందుతున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయసహాయం కోసం అవగాహన కల్పించాలని జైలు అధికారులకు సూచించారు.

క్రీడల్లో రాణించండి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇందుకూరి

శృంగవరపుకోట, మే 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు ఉద్యోగాల్లో 3 శాతం రిజర్వేషన్ కల్పిసున్న నేపథ్యంలో వాటిని అందిపుచ్చుకోవాలని ఎమ్మెల్సీ, బ్యాడ్మింటన్ జిల్లా అసోసియేషన్ చైర్మన్ ఇందుకూరి రఘురాజు అన్నారు. శనివారం పట్టణంలోని బ్యాడ్మింటన్ శిబిరంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు, వారి తల్లిదండ్రుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు చదవుకు ఆటంకం కాదన్నారు. ప్రతి విద్యార్థి క్రీడల్లో పాల్గొనేలా తల్లిదండ్రులు ప్రోత్సాహించాలన్నారు. ఇక్కడ శిక్షణ ఇస్తున్న చీఫ్ కోచ్ పొట్నూరు శ్రీరాములుకు జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దిన ఘనత ఉందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాపాధికార సంస్థ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు, డాక్టర్ ఆర్.కిషోర్, కోచ్‌లు మహ్మద్ ఖలీలుల్లా, బి.హారిక, పి.మౌనిక తదితరులు వున్నారు.

సమన్వయంతో అభివృద్ధి సాధించండి


మాట్లాడుతున్న ఎంపీపీ సుధారాణి

నెల్లిమర్ల, మే 17 (ఆంధ్రజ్యోతి): అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి అభివృద్ధిని సాధించాలని ఎంపీపీ అంబళ్ల సుధారాణి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఆమె అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అధికారులు సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక చేసేటప్పుడు విధిగా సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు సమాచారమివ్వాలన్నారు. వైస్ ఎంపీపీ సారిక వైకుంఠం నాయుడు మాట్లాడుతూ 104 వాహనాల్లో అవసరమైన మందులు అందుబాటులో లేవన్నారు. ఆసుపత్రుల్లో పాము, కుక్క కాటు వ్యాక్సిన్‌ను సిద్ధంగా ఉంచాలని బొప్పడాం సర్పంచ్ అంబళ్ల కిరణ్‌కుమార్, జోగిరాజుపేటకు చెందిన మత్స శ్రీను కోరారు. వ్యవసాయ శాఖ సమీక్షలో అంబళ్ల కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఇంత వరకూ ప్రభుత్వం అమ్మఒడి, రైతు భరోసా సొమ్ము జమ చేయలేదన్నారు. రైతు భరోసా జాబితాలను తమకు అందజేయాలని గొ ర్లెపేట, సతివాడ సర్పంచ్‌లు ఎస్.పరిసినాయుడు, రేవళ్ల శ్రీనివాసరావు కోరారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సుదర్శనం, హెచ్‌డీటీ రవిశంకర్ పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవం

రాజాం, మే 17 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని కంచరవీధిలో సత్యసాయి విగ్రహ ప్రతిష్ఠోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. చిలుకూరి చంటిశర్మ, బంకుపల్లి వెంకట భాస్కరశర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విగ్రహ దాతలు గ్రంధి మల్లికార్జునరావు, వరలక్ష్మి దంపతులు, రజిత యంత్ర దాతలు గట్టి పద్మావతి, పాపారావు దంపతులు, సత్యసాయి మందిరం ప్రతినిధులు పాల్గొన్నారు. అధికసంఖ్యలో భక్తులు సాయిని దర్శించుకున్నారు.

స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రను సాధిద్దాం



విజయనగరంలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు, వైద్య కళాశాల ఉద్యోగులు, సిబ్బంది


భోగాపురం: మొక్కలు నాటుతున్న బంగార్రాజు

విజయనగరం రింగురోడ్డు, మే 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని దాసన్నపేటలో శనివారం విద్యుత్ ఉద్యోగులు స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ శాఖ ఎస్ఈ ఎం.లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఉద్యోగులు ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో డీజీఎం కేవీ లక్ష్మీనారాయణ, ఎస్ఏవోఎస్ అప్పలనాయుడు, ఈఈలు వి.మురళీకృష్ణ, జి.సురేష్, పి.త్రినాథ్, వి.సత్యనారాయణ, డీఈఈలు, ఏఈలు, ఏవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

● ప్రభుత్వ వైద్య కళాశాలలో శనివారం వైస్ ప్రిన్సిపాల్ కె.సునీత ఆధ్వర్యంలో ఉద్యోగులు శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛంధ్ర-స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కె.రాధామణి తదితరులు పాల్గొన్నారు.

●జేఎన్‌టీయూలో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా వర్సిటీ ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంకుడు గుంతల నిర్మాణాలను చేపట్టారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ జి జయసుమ, వైస్ ప్రిన్సిపాల్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

●భోగాపురం: భోగాపురంలో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల నియోజవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో కిశోర్‌కుమార్, ఈవోపీఆర్డీ గాయత్రి, నాయకులు కె.సుభాషణరావు, పడాల భానుప్రకాశ్, వరుపుల సుధాకర్, పల్లంట్ల జగదీశ్, పల్ల రాంబాబు, గుండపు సూర్యారావు తదితరులున్నారు.


నెల్లిమర్లలో ర్యాలీ..

●నెల్లిమర్ల: నెల్లిమర్ల నగర పంచాయతీలో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర అవగాహన ర్యాలీ నిర్వహించారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మొయిద జంక్షన్ వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో కమిషనర్ ఎ.తారక్‌నాథ్, షైపాడ ప్రసాద్, ముడిమంచి లక్ష్మణరావు, బంగారు శంకరరావు, మెప్మా సీఎంఎం దన్నాన గోవిందరావు పాల్గొన్నారు.

పనులు చేపట్టేది ఇలాగేనా?

(5వ పేజీ తరువాయి)

నిర్మించడంతో సక్రమంగా మురుగునీరు వెళ్లడం లేదు.

● త్రినాథస్వామి ఆలయం వైపు కాలువ నిర్మించకపోవడంతో ఇళ్లలో వాడుక నీరు ఆ ప్రాంతంలో నిలిచిపోతుంది.

● బస్టాండ్ వద్ద ఉన్న ఇళ్ల, రోడ్డుకు మీటరు ఎత్తులో కాలువలు నిర్మించారు. దీంతో వాడుక నీరు ఎలా వెళ్తుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

● విస్తరణలో భాగంగా కురుపాంలో చేపడుతున్న సీసీ రోడ్డు పనులపై కూడా అధికారుల పర్యవేక్షణ కొరవడింది. దీనిపై ఉన్నతాధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

మా దృష్టికి రాలేదు..

మూడు మండలాలకు ఏఈలు లేకపోవడంతో ఇన్‌చార్జి బాధ్యతలు చేపడుతున్నా. పనుల ఒత్తిడి కారణంగా పూర్తి స్థాయిలో పర్యవేక్షించలేకపోతున్నాం. కనీసం ఒక వర్క్ ఇన్‌స్పెక్టర్ కూడా లేరు. కురుపాంలో చేపడుతున్న రోడ్డు, కాలువ పనుల్లో లోపాలు మా దృష్టికి రాలేదు. పైనలవీధి సమీపంలో స్థానికులు అభ్యంతరం తెలపడంతో అక్కడ కాలువ నిర్మాణం చేపట్టలేదు.

- సుశీల, ఇన్‌చార్జి ఆర్అండ్‌బీ ఏఈ

విద్యుదాఘాతంతో దున్నపోతుల మృతి

భామిని, మే 17 (ఆంధ్రజ్యోతి): సొలికిర గ్రామానికి చెందిన బి.కరువులు అనే వ్యక్తికి చెందిన జోడి దున్నపోతులు విద్యుదాఘాతానికి గురై శనివారం మృతిచెందాయి. వివరాలు ఇలా ఉన్నాయి. కరువులు పోతుల బండితో సామగ్రి తరలిస్తూ వచ్చిన కిరాయిలో కుటుంబ పోషణ చేస్తుండేవాడు. ప్రస్తుతం ఎటువంటి పనులు లేకపోవడంతో పోతులను ఊరు సమీపంలో మేతకు విడిచిపెట్టాడు. అయితే అక్కడ ఉన్న విద్యుత్ స్తంభం పూర్తిగా వంగి ఉండడంతో ఆ వైర్లు పోతులకు తగిలాయి. దీంతో అవి విద్యుత్ షాక్‌కు గురై అక్కడిక్కడే మృతిచెందాయి. సుమారు లక్ష రూపాయలు విలువ చేసే పోతులు మృతిచెందడంతో కుటుంబపోషణ కష్టమని కరువులు దిగులు చెందుతున్నాడు. ఈ సమాచారాన్ని స్థానికులు విద్యుత్, పశు సంవర్థకశాఖ సిబ్బందికి తెలియజేశారు.

స్తంభం చుట్టూ మట్టిని తొలగించడం వల్లే..

ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. విద్యుత్ స్తంభం చుట్టూ ఉన్న మట్టిని ఉపాధి పనుల్లో తొలగించడం వల్ల స్తంభం వాలడంతో ఈ ఘటన చోటుచేసుకుందని ఆయన తెలిపారు. బాధితుడు దరఖాస్తు చేసుకుంటే పై అధికారులకు తెలియజేస్తామన్నారు. పశువైద్య సిబ్బంది పోతులకు పోస్టుమార్టం చేశారు. నిరుపేద కూలీకి ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని స్థానికులు అధికారులను కోరారు.

ఏకాభిప్రాయంతోనే కన్వీనర్ల ఎంపిక

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మహేష్‌బాబు

గరుగుబిల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల కన్వీనర్లను ఏకాభిప్రాయంతోనే ఎంపిక చేస్తున్నామని పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కురుపాం నియోజకవర్గ పరిశీలకుడు ఆరేటి మహేష్‌బాబు స్పష్టం చేశారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఈనెల 10 నుంచి 16వ తేదీ వరకు గరుగుబిల్లి, జియ్యమ్మవలస, కురుపాం, కొమరాడ, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో కార్యకర్తల అభిప్రాయాలను తెలుసుకున్నామన్నారు. గతంలో కంటే ఈ పర్యాయం అధికంగా ప్రతిపాదనలు రావడంతో ఐవీఆర్ఎస్ ద్వారా పరిశీలన చేసి కన్వీనర్లను ఎంపిక చేస్తామని తెలిపారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సమావేశంలో మండల కన్వీనర్‌గా మూడు పర్యాయాలకు మించి పనిచేయరాదని ఆదేశాలు జారీ అయ్యాయన్నారు. గత ఎన్నికల్లో పనితీరు ఆధారంగా కష్టపడే వారిని గుర్తించి తగిన ప్రాధాన్యత ఇస్తామని, అలాగే పార్టీలో సీనియర్లకు సముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు. మండలాల వారీగా వచ్చిన ప్రతిపాదనలను అధిష్ఠానానికి నివేదిస్తామన్నారు. నూతన నియామకాలను మహానాడులోపే ప్రకటిస్తామని తెలిపారు. గరుగుబిల్లి మండలం నుంచి నలుగురు, జియ్యమ్మవలస మండలం నుంచి ఐదుగురు, కురుపాం మండలం నుంచి ఏడుగురు, కొమరాడ మండలం నుంచి 8 మంది, గుమ్మలక్ష్మీపురం మండలం నుంచి ఆరుగురు పార్టీ కన్వీనర్ల ప్రతిపాదనలు అందాయని ఆయన వివరించారు.

రహదారులకు మరమ్మతులు

సాలూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): శ్యామలాంబ పండుగ నేపథ్యంలో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి చొరవతో సాలూరు పట్టణంలో ఉన్న పలు రహదారులకు ప్రత్యేక నిధులతో శనివారం మరమ్మతులు చేపట్టారు. ఇప్పటికే పట్టణం మొత్తం విద్యుత్ దీపాలతో అలంకరించారు. దాతలు, ఉత్సవ కమిటీ చూపించిన చొరవతో అమ్మవారి ఆలయం అందంగా మారింది.

మొబైల్ టాయిలెట్స్ సిద్ధం

సాలూరు పట్టణంలో ఉన్న సాముహిక మరుగుదొడ్ల మరమ్మతులకు మంత్రి ప్రత్యేక నిధులు తీసుకొచ్చినప్పటికీ పాలకవర్గం అలసత్వంతో వాటిని ఖర్చు చేయలేదు. దీంతో పట్టణంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా 50కి పైగా మొబైల్ టాయిలెట్స్‌ను వివిధ కూడళ్ల వద్ద ఏర్పాటు చేశారు.

ఎమ్మార్సీకి చేరిన విద్యా కిట్లు

సీతంపేట రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సంబంధించి బ్యాగ్‌లు, బెల్ట్‌లు స్థానిక ఎమ్మార్సీకి శనివారం చేరాయి. వారంరోజుల ముందు టెస్ట్ బుక్స్, నోట్ బుక్స్ వచ్చాయి. మండలంలోని ఎంపీయుపీ పాఠశాలల్లో చదువుతున్న 10,687 మంది విద్యార్థులకు వీటిని అందజేయనున్నట్టు ఎంఈవో-2 సూర్యచంద్రరావు తెలిపారు. ఇంకా విద్యార్థులకు సంబంధించి యూనిఫాం, షూస్ రావాల్సి ఉందని, అవికూడా నెలాఖరు నాటికి వస్తాయని చెప్పారు. విద్యాకిట్లు అన్ని వచ్చిన తర్వాత విద్యార్థులకు పాఠశాలల వారీగా పంపిణీ చేస్తామని తెలిపారు. స్కూల్ బ్యాగ్‌లకు వారంటీ కూడా ఉందని ఎంఈవో చెప్పారు. వీటిని ఎంఈవోతో పాటు హెచ్ఎం చంద్రరావు, ఉపాధ్యాయుడు రవి పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

సీతానగరం, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కింతలవానిపేట కూడలి వద్ద శనివారం ద్విచక్ర వాహనం, వ్యాను ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. సీతానగరం మండలం కృష్ణరాయపురం గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై లచ్చయ్యపేట స్టేట్ బ్యాంకుకు వెళ్తుండగా, బొబ్బిలి నుంచి పార్వతీపురం వైపు వస్తున్న వ్యాను కింతలవానిపేట సమీపంలో ఆ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ఆ ముగ్గురికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం బొబ్బిలి ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శిక్షణను వినియోగించుకోండి

గరుగుబిల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణను వినియోగించుకోవాలని ఎంపీడీవో జి.పైడితల్లి సూచించారు. మండల కేంద్రంలో బీసీ కార్పొరేషన్ నిర్వహిస్తున్న కుట్టు శిక్షణను ఆమె శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 25 పంచాయతీల పరిధిలో నిబంధనల మేరకు లబ్ధిదారులను ఎంపిక చేశామని చెప్పారు. ఈ శిక్షణలో 75 శాతం హాజరు ఉన్నవారికి ఉచితంగా కుట్టు మిషన్లు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శిక్షకురాలు పెద్దింటి ప్రసన్న పాల్గొన్నారు.

ధ్యానంతో అపార జ్ఞాపక శక్తి

గరుగుబిల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): ధ్యానంతో అపార జ్ఞాపక శక్తి సిద్ధిస్తుందని విశ్రాంత ఐఏఎస్ అధికారి జె.మురళి తెలిపారు. తోటపల్లి జట్టు ట్రస్ట్ కార్యాలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న కెరీర్ గైడెన్స్ శిక్షణ శనివారంతో ముగిసింది. ముగింపు సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసి నిరంతరం నిరుద్యోగ యువతీ యువకులపై ప్రత్యేక దృష్టి పెట్టి సలహాలు ఇవ్వడం ద్వారా ప్రోత్సాహం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విజయనగరం మహారాజా ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మోహన్‌కుమార్, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా విశ్రాంత చీఫ్ మేనేజర్ లక్ష్మణరావు, యూనియన్ బ్యాంకు విశ్రాంత చీఫ్ మేనేజర్ ఉదయభాస్కర్, శ్రీధర్‌నాయుడు, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి

● స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా గ్రామాల్లో 'బీట్ ది హీట్' అవగాహన కార్యక్రమాలు

● మొక్కలు నాటిన అధికారులు



పార్వతీపురంటౌన్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర


సీతంపేటరూరల్: ఐటీడీఏ కార్యాలయ పరిసరాల్లో చెత్తను ఊడ్చుతున్న ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి


పాలకొండ: ప్రతిజ్ఞ చేయిస్తున్న నగర పంచాయతీ కమిషనర్ రత్నరాజు

పార్వతీపురంటౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి): వేసవి వేడి నుంచి రక్షించుకునేందుకు ప్రతిఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. ప్రతిఒక్కరూ సౌర విద్యుత్ పునరుత్పత్తిని ప్రోత్సాహించాలని, చెరువులు, కుంటలను పునః నిర్మించుకుందామని పిలుపునిచ్చారు. అలాగే ప్లాస్టిక్, కాలుష్య రహిత పార్వతీపురాన్ని నిర్మించుకుందామన్నారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ● పాలకొండ: ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత తో పాటుగా పరిసరాల పరిశుభ్రత పాటించాలని నగర పంచాయతీ కమిషనర్ రత్నరాజు కోరారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహిం చారు. అనంతరం స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేశారు. సచివాలయ శానిటరీ సెక్రటరీలు, శానిటరీ మేస్త్రీలు, సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు. ● పార్వతీపురం రూరల్: వేసవి వేడి నుంచి ఉపశ మనం పొందే మార్గాలను అనుసరించాలని డీఎంహెచ్ వో ఎస్.భాస్కరరావు అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్రలో భాగంగా శనివారం వెంకంపేటలో బీట్ ది హీట్ కార్యక్రమంలో నిర్వహించారు. తామర చెరువు వద్ద ఉపాధి వేతనదారులకు అవగాహన కల్పించారు. వేసవి తాపం నుంచి ఎలా ఉపశమనం పొందాలో వివరించారు. అనంతరం ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. స్వచ్ఛ ఆంధ్ర నోడల్ అధికారి టి.జగన్మోహన రావు మాట్లాడుతూ స్వచ్ఛంధ్ర కార్యక్రమ వివరాలను వైద్య సిబ్బంది సాసా యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నా రు. డీపీఎంవో పీఎల్ రఘుకుమార్, వైద్యాధికారి తిరుమలప్రసాద్, సర్పంచ్ తీళ్ల కృష్ణ, సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ● సీతంపేట రూరల్: పరిసరాల పరిశుభ్రతతోనే మెరుగైన ఆరోగ్యం సాధ్యమని ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక ఐటీడీఏ కార్యాలయ పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తను పీవోతో పాటు ఏపీవో జి.చిన్నబాబులు తొలగించారు. స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూ డీఈ సింహాచలం, ఏవో సునీల్, పీహెచ్‌వో వెంకటగణేష్, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ శ్రీహరి, ఏఎంవో కోటిబాబు, జీసీడీవో రాములమ్మ తదితరులు పాల్గొన్నారు. ● బొబ్బిలి రూరల్: స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం బొబ్బిలి పట్టణంలోని చర్చి సెంటర్‌లో బీట్ ద హీట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి పాల్గొని, బస్‌స్టాప్‌కు ఏర్పాటు చేసిన షేడ్‌నెట్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు ప్రతిఒక్కరూ మొక్కలను విరివిగా నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలి: మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

సీతంపేట ప్రత్యేకాధికారిగా చిన్నబాబు

సీతంపేట రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): సీతంపేట మండల ప్రత్యేకాధికారిగా జి.చిన్నబాబును ప్రభుత్వం నియమించింది. సీతంపేట ఐటీడీఏ ఏపీవోగా విధులు నిర్వహిస్తున్న చిన్నబాబుకు మండల ప్రత్యేకాధికారిగా బాధ్యతలను అప్పగిస్తూ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ శుక్రవారం సాయంత్రం ఆదేశాలు జారీ చేశారు.

జనసేన సభ్యత్వ ఐడీ కార్డుల పంపిణీ

సీతంపేట రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): అంటికొండ గ్రామంలో శనివారం జనసేన పార్టీ మండల అధ్యక్షుడు మండంగి విశ్వనాథం పార్టీ సభ్యత్వ కార్డులు పంపిణీ చేశారు. వలంటీర్లకు జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ ఐడీ కార్డులు, కిట్లను గడపగడపకు వెళ్లి పంపిణీ చేశారు. వలంటీర్లకు ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

పార్వతీపురంలో నేడు మినీ మహానాడు

పార్వతీపురం, మే 17 (ఆంధ్రజ్యోతి): పార్వతీ పురంలో టీడీపీ మినీ మహానాడు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర శనివారం చెప్పారు. నియోజకవర్గ పరిధిలో ఉన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని ఆయన కోరారు. పార్వతీపురంలో ఉన్న రాయల్ కన్వెన్షన్ హాల్లో ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు.

మలేరియా నివారణకు ఏసీఎం పిచికారీ

సీతంపేట రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ కార్యాలయ పరిసరాలతో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో శనివారం యాంటీ మలేరియా (ఏసీఎం) మందును పిచికారీ చేశారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు.

సమ్మె వాయిదా

పాలకొండ, మే 17 (ఆంధ్రజ్యోతి): ఈనెల 20న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మె ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో జూలై 9కు వాయిదా వేశాయని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు తెలిపారు. కొండాపురం గ్రామంలో ఆయన శనివారం విలేకర్లతో మాట్లాడారు. దేశ వ్యాప్తం సమ్మె వాయిదా పడినప్పటికీ మండల, జిల్లా కేంద్రాల్లో కార్మిక సంఘాలు మే 20న నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చాయని తెలిపారు. రైతులు, వ్యవసాయ కార్మికులు పాల్గొనాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు కిమిడి రామ్మూర్తినాయుడు, బలగ దుర్గారావు, మజ్జి సన్యాసినాయుడు, పారినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి


టీడీపీ నాయకులుతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

పార్వతీపురం, మే 17 (ఆంధ్రజ్యోతి): పార్వతీపు రం తహసీల్దార్ జయలక్ష్మిపై చర్యలు తీసుకోవాలని స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే విజయచంద్రపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద వారు ఆందోళన చేపట్టారు. ఎమ్మెల్యేపై తప్పుడు ఆరోపణలు చేయడంతో పాటు ములగ రైతుల వద్ద ఆమె రూ.10 లక్షలు లంచం డిమాండ్ చేశారని, అందులో రూ.2లక్షలు రైతులు ఇచ్చారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఓబీసీ తదితర ధ్రువీకరణ పత్రాలను సకాలంలో ఇవ్వకుండా ఇబ్బందులు తహసీల్దార్ పెడుతున్నారని మరికొంతమంది టీడీపీ నాయకులతో కలిసి ధర్నాలో పాల్గొన్నారు. విషయం తెలుసుకున్న సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అక్కడికి చేరుకుని, ఆందోళనకారులతో చర్చించారు. టీడీపీ నాయకులు ఆయనకు సమస్యను వివరించారు. దీనిపై సబ్ కలెక్టర్ స్పందించి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అవినీతి ఆరోపణలపై దర్యాప్తు నిర్వహించి నివేదికను కలెక్టర్ శ్యాం ప్రసాద్‌కు అందిస్తామని చెప్పారు.

వైసీపీ అక్రమార్కులకు అండగా నిలుస్తోంది

● పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర

బెలగాం, మే 17 (ఆంధ్రజ్యోతి): జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాస్ వాఖ్యలు చూస్తే వైసీపీ అక్రమార్కుల కు అండగా నిలుస్తోందని మరోసారి రుజువైందని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఆరోపించారు. శనివారం ఆయన పార్వతీపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. జడ్పీ చైర్మన్ పార్వతీపురం తహసీల్దార్‌కు మద్దతుగా మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు బోను చంటి, కొప్పలవెలమ డైరెక్టర్ జి.వెంకటనాయుడు, రౌతు వేణు పాల్గొన్నారు.

టీడీపీలో వైసీపీ కౌన్సిలర్ల చేరిక


కౌన్సిలర్లను పార్టీలోకి ఆహ్వానిస్తున్న నాయకులు

బొబ్బిలి/రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): వైసీపీకి చెందిన ఐదుగురు కౌన్సిలర్లు వారి అనుచరులు 50 మందితో కలిసి టీడీపీలో చేరారు. శనివారం వారంతా బొబ్బిలి కోటలో ఎమ్మెల్యే బేబీనాయన, ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఆర్‌వీఎస్‌కే రంగారావు, బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఇందులో 14వ వార్డు కౌన్సిలర్ శీర శ్రీలక్ష్మి, 22వ వార్డు కౌన్సిలర్ తెంటు పార్వతి, 23వ వార్డు కౌన్సిలర్ కొర్లాపు రామారావు, 26వ వార్డు కౌన్సిలర్ మరిపి తిరుపతిరావు, ఏడో వార్డు కౌన్సిలర్ దిబ్బ సునీత, గోపి దంపతులు ఉన్నారు. వారికి ఎమ్మెల్యే టీడీపీ కండువాలు వేసి, పార్టీలోకి ఆహ్వానించారు.

అల్ట్రాసౌండ్ స్కాన్ పరికరం ప్రారంభం

పాలకొండ, మే 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆసుపత్రిలో డెక్కన్ ఫైన్ కెమికల్స్ ప్రైవేటు లిమిటెడ్ సీఎస్ఆర్ ద్వారా అందించిన అల్ట్రాసౌండ్ స్కాన్ పరికరాన్ని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మెరుగైన సేవలందించి ఆసుపత్రిపై మరింత నమ్మకం కలిగిలా చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్ నాగభూషణరావుకు సూచించారు. ఆసుపత్రిలోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఆయన హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి, కూటమి నాయకులు గంటా సంతోష్‌కుమార్, ఆనాపు జవరాజు తదితరులు పాల్గొన్నారు.

జీసీసీ మేనేజర్‌గా రాము

గుమ్మలక్ష్మీపురం, మే 17 (ఆంధ్రజ్యోతి): గుమ్మలక్ష్మీపురం గిరిజన సహకార సంస్థ బ్రాంచ్ మేనేజర్‌గా డి.రామును నియమిస్తూ జీసీసీ ఎండీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన ప్రస్తుతం సీతంపేట డీసీసీ బ్రాంచ్ అకౌంటంట్‌గా పనిచేస్తూ బదిలీపై వస్తున్నారు. ఇక్కడ మేనేజర్‌గా పనిచేస్తున్న కృష్ణప్రసాద్‌ను పాడేరు జీసీసీ డీఎంగా బదిలీ చేశారు. గుమ్మలక్ష్మీపురం బ్రాంచిలో గోదాం సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న సాంబశివరావును పార్వతీపురం జీసీసీ బీఎంగా బదిలీ చేశారు.

ఎంపీడీవోగా ప్రసాద్ బాధ్యతల స్వీకరణ

సీతానగరం, మే 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎంఎల్ఎస్ ప్రసాద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. మండలంలో పరిపాలన అధికారిగా పనిచేసి పదోన్నతిపై పాచిపెంట ఎంపీడీవోగా వెళ్లారు. తిరిగి పాచిపెంట నుంచి సీతానగరం బదిలీ అయ్యారు. ఈయనను మండల పరిషత్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

వ్యాపారమ్మకు డీఎస్పీ పూజలు

గుమ్మలక్ష్మీపురం, మే 17 (ఆంధ్రజ్యోతి): గుమ్మలక్ష్మీపురం గ్రామదేవత వ్యాపారమ్మతల్లిని పాలకొండ డీఎస్పీ రాంబాబు శనివారం దర్శించుకున్నారు. గ్రామ దేవత పండుగ నేపథ్యంలో ఆయన వ్యాపారమ్మతల్లి దర్శించుకుని, పూజలు చేశారు. డీఎస్పీకి సర్పంచ్ గౌరీశంకరరావు, గ్రామ పెద్దలు ఆహ్వానం పలికారు.

సమగ్ర విచారణ చేపట్టాలి

బొబ్బిలి రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలోని సింహాలతోటలో ఉన్న ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాల అభివృద్ధికి కేటాయించిన నిధులను ప్రిన్సిపాల్, కాంట్రాక్టర్ తప్పుడు లెక్కలతో పక్కదోవ పట్టిస్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ ఆరోపించారు. ఈసందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి కోసం ప్రభుత్వం సుమారు రూ.5లక్షల నిధులు విడుదల చేసిందని, ఆ నిధులను పక్కదోవ పట్టించారని, ఏ పని కోసం నిధులు విడుదలయ్యాయో అవి చేయలేదని ఆరోపించారు. సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు.

ఇక పక్కాగా స్వయంశక్తి సంఘాల సమావేశాలు

● ముఖ ఆధారిత నమోదు ప్రారంభం

వీరఘట్టం, మే 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో స్వయంశక్తి సంఘాలు ప్రతినెలా సమావేశాలు నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. సభ్యులంతా హాజరయ్యేందుకు వీలుగా ముఖ ఆధారిత నమోదు ప్రక్రియను ప్రారంభించింది. గతంలో సమావేశాలు పెట్టకపోయినా నిర్వహించినట్టు దస్త్రాల్లో సంతకాలు చేయిస్తున్నారనే అపవాదు ఉండేది. బ్యాంకు రుణం తీసుకున్నప్పుడు మాత్రమే గ్రూప్ సభ్యులందరూ వచ్చేవారు. ఎక్కడున్నా సంఘం సభ్యులు పొదుపు డబ్బులు పంపిస్తే చాలు అనే విధంగా ఉండేది. ఇప్పుడు అలా కాకుండా పారదర్శకత పెంపొందించేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. గ్రామంలో ప్రతి స్వయంశక్తి సంఘం సమావేశం నిర్వహించి సంఘం ఫోటోతో పాటు సభ్యురాలు ఫోటో యాప్‌లో సీఏఫ్ ప్రతినిధి నిక్షిప్తం చేయాలి. ప్రతి నెలా ఎక్కడ సమావేశం నిర్వహిస్తారు, ఆ ప్రాంతాన్ని నమోదు చేయాలి. దీంతో ఆ ప్రదేశానికి వంద మీటర్ల దూరంలో సమావేశం నిర్వహిస్తేనే యాప్ అంగీకరిస్తుంది. సభ్యురాలు ఫోటోలు తీసి జియో ఫేస్ రిజిస్ట్రేషన్ ఫెన్సింగ్ యాప్‌లో పొందుపర్చాలి. దీంతో సభ్యురాలు వస్తేనే హాజరుపడుతుంది. మండలంలో 1,756 గ్రూప్‌లు ఉండగా, సుమారు 19,450 మంది సభ్యులు ఉన్నారు. గ్రామాల్లోని సంఘాల సభ్యులను సమావేశపరిచి ముఖ గుర్తింపు, బుక్ కీపింగ్, చరవాణి నెంబర్ అనుసంధానం చేస్తారు. దీంతో పొదుపు ఎంత చేస్తున్నారు, ఎంత నిల్వ ఉంది, ఎంత రుణం తీసుకున్నారు తదితర వివరాలు సభ్యురాలు చరవాణికి సందేశం అందుతుంది.

రెండు రోజులుగా నమోదు చేస్తున్నాం

మండలంలో గత రెండు రోజుల నుంచి మహిళా సంఘ సభ్యుల ముఖ గుర్తింపు నమోదు చేస్తున్నాం. ఈ నెలాఖరుకు పూర్తి చేసి జూన్ నుంచి అమలయ్యేలా ప్రణాళికలు తయారు చేస్తున్నాం.

- కెల్ల రాము, ఏపీఎం, వీరఘట్టం

సారా రహిత గ్రామంగా కొయ్యికొండవలస

బొబ్బిలి రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): సీహెచ్ బొడ్డవలస పంచాయతీ కొయ్యికొండవలసను సారా రహిత గ్రీన్ గ్రామంగా ప్రకటించినట్టు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పి.చిన్నంనాయుడు తెలిపారు. ఈసందర్భంగా శనివారం ఆ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కొయ్యికొండవలస గ్రామాన్ని బీ కేటగిరి గ్రామంగా గుర్తించామని చెప్పారు. గత మూడు నెలలుగా ప్రతిరోజూ అవగాహన సదస్సులు నిర్వహించామని, దాడులు, తనిఖీలు చేపట్టామని తెలిపారు. సర్పంచ్ పి.వేలాంగిని, ఎస్ఐ బి.రాముడు, పంచాయతీ కార్యదర్శి సుచిత, వీఆర్వో పోలినాయడు పాల్గొన్నారు.

నీటి తీరువా బకాయిలు వసూలు చేయండి

బాడంగి, మే 17(ఆంధ్రజ్యోతి): వీఆర్వోలు తక్షణమే తమ పరిధిలో ఉన్న రైతుల వద్ద నుంచి నీటి తీరువా బకాయిలను వసూలు చేయాలని తహసీల్దార్ కె.సుధాకర్ కోరారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన వీఆర్వోలతో సమీక్ష నిర్వహించారు. వీఆర్వోలంతా గ్రామాల్లో పర్యటించి రైతుల నుంచి నీటితీరువా బకాయిలు వసూలు చేయాలన్నారు. అలాగే రెవెన్యూ సంబంధిత పనులను ఎప్పటికప్పుడు పూర్తిచేయాలని, ప్రజల నుంచి వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ ధనం, మండల సర్వేయర్లు, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన అవసరం

బొబ్బిలి రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మున్సిపాలిటీ పరిధి ఇందిరమ్మ కాలనీలో పట్టణ సీఐ కటకం సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన.. స్పీడ్ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవ్, క్రికెట్ బెట్టింగ్, గంజాయి తదితర అంశాలపై కాలనీవాసులకు అవగాహన కల్పించారు.

వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలి


సరుకులు తనిఖీ చేస్తున్న దృశ్యం

బెలగాం, మే 17 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలని అడిషనల్ జ్యూడిషల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ జె.సౌమ్య జోషఫిన్ ఆదేశించారు. జిల్లా న్యాయ సేవా సాధికార సంస్థ ఆదేశాల మేరకు పార్వతీపురం కళాశాల బాలికల బీసీ వసతి గృహం, ఎస్సీ బాలుర వసతి గృహం, బీసీ బాలికల వసతి గృహం తదితర వసతి గృహాలను ఆమె శనివారం ఆకస్మికంగా సందర్శించారు. వసతి గృహాల్లో ఉన్న సరుకులను తనిఖీ చేశారు. సౌకర్యాలను పరిశీలించారు.